

అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద పథకానికి శనివారం సికింద్రాబాద్‌కు చెందిన కె.చంద్రశేఖర్ రూ.లక్ష, గుంటూరుకు చెందిన సాంబశివరావు రూ. లక్ష విరాళం అందించారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శనివారం నెల్లూరుకు చెందిన శివసాయి కళానిలయం కళాకారులు శైవ గీతాలకు సంప్రదాయ నృత్యం చేసి భక్తులను అలరించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,627.02
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 83.259
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 453
అవుట్ ఫ్లో	: 8,896

న్యూస్‌రీల్

2న ఏకసభ్య కమిషన్ రాక

నంద్యాల(అర్బన్): షెడ్యూల్డు కులాల్లోని ఉప - వర్గీకరణపై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నియమించిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ జనవరి 2వ తేదీన కర్నూలుకు రానుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి చింతామణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిషన్ మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సమావేశం నిర్వహించి జిల్లా అధికారులు, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో వినతి పత్రాలను స్వీకరిస్తుందన్నారు. తర్వాత వాటిని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికల రూపంలో పంపుతుందన్నారు. కమిషన్‌కు వినతులు అందించే వారు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారై ఉండాలని సూచించారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.5.35 లక్షలు

బేతంచెర్ల: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శనివారం క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వివిధ సేవల ద్వార రూ.5,35,095 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఇందులో చెన్నై నగరానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్య ఆచారి కుమారుడు కమ్మరి విష్ణు ఆలయ అభివృద్ధికి రూ. 2లక్షల విరాళం అందజేశారన్నారు.

గనుల యజమానులకు తాత్కాలిక ఊరట

కొలిమిగుండ్ల: నాపరాతి గనుల యజమానులకు తాత్కాలిక ఊరట లభించింది. దీంతో కొద్దిరోజులుగా స్తంభించిన నాపరాళ్ల రవాణా మొదలైంది. ఇటీవలనే కూటమి ప్రభుత్వం కన్సిడరేషన్ ఫీజు లక్షల్లో చెల్లించాలని గనుల యజమానులకు ఆదేశాలు జారీ చేయడంతో వారం రోజుల క్రితం నాపరాతి రవాణా ఆగిపోయింది.దీంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. యజమానులు, కార్మికుల నుంచి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడటంతో భూగర్భ గనుల శాఖ ఉన్నతాధికారులు సింగిల్ రాయల్టీతో రోజంతా నాపరాళ్ల రవాణాకు అవకాశం కల్పించారు. కన్సిడరేషన్ ఫీజుపై ప్రభుత్వం జనవరి 10లోగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉండటంతో అంత వరకు సరఫరాకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తుంది.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్, ఎస్పీ


బనగానపల్లె రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మంత్రి బీసీ దంపతుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా మెగా ర్యాలీ జరిగింది. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ ఆధిరాజ్‌సింగ్‌రాణాలతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరైన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తన సతీమణి బీసీ ఇందిరమ్మ ఎంతో పట్టుదలతో ఈ కార్యక్రమం చేపట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజం కోసం ప్లాస్టిక్ నిర్మూలన ఎంతో ముఖ్యమన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, బీసీ సోదరుడు బీసీ రామ్‌నాథ్‌రెడ్డి, పలుశాఖల ఉన్నతాధికారులు పట్టణ వ్యాపారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేను.. నా స్టేటస్!

సండే స్పెషల్

- వాట్సాప్ స్టేటస్‌లో మనోభావాలు వ్యక్తీకరణ
- అక్కడే సూక్తులు, పరోక్షంగా విమర్శనాస్త్రాలు
- అధిక శాతం భక్తి సంబంధిత విషయాలు పోస్టు
- వ్యాపార ప్రకటనలకు అదే మార్గం
- వ్యక్తిగత ప్రతిభ చాటి చెప్పేందుకు సైతం
- స్టేటస్‌ను విస్తృతంగా వాడుతున్న ప్రజలు

మాట.. పాట.. ఆట..
ఆనందం.. ఆశ్చర్యం.. విషాదం
వార్తలు.. విశేషాలు.. వింతలు
శుభాకాంక్షలు.. విమర్శలు.. సూచనలు
విద్య, ఉద్యోగం.. వ్యాపారం..
పుట్టుక.. పెళ్లి.. చావు..
ఆధ్యాత్మికం..విహారం.. ఆరోగ్యం..
ఇలా.. అన్నీ ఒకే వేదికపై అందరితో
స్మార్ట్‌గా పంచుకుంటున్నారు.
'నా స్టేటస్.. నా ఇష్టం'.. అంటూ
రోజూ అందరినీ పలకరిస్తూ
సాగిపోతున్నారు.



కర్నూలు(హాస్పిటల్): సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడొక వేదికగా మారింది. అందులో ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్‌లోని ఫీచర్ అయిన 'స్టేటస్'ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటుపడ్డ ఈ తరుణంలో 'స్టేటస్'లో పోస్టు పెట్టడమనేది ఒక స్టేటస్‌లా భావిస్తున్న వారూ ఉన్నారు. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాప్ స్టేటస్ వేదికగా వాడుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనాభా దాదాపు 50 లక్షల వరకు ఉంటుంది. అందులో పిల్లలు మినహాయిస్తే 40 లక్షల వరకు యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. వీరిలో కనీసం 50 శాతం మందికి అంటే 20 లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపుగా స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. వాట్సాప్‌ను ఉపయోగించే వారందరూ స్టేటస్‌లో వారికి నచ్చిన అంశాలను పోస్టు చేస్తూ ఉండటం లేదా చూస్తూ ఉండటం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్‌ను ఉపయోగించే వారిలో 10 నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచర్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది ఈ ఫీచర్‌ను చూస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రోజులో నాలుగైదు సార్లైనా స్టేటస్ చూడందే నిద్రపోవడం లేదని సమాచారం. వారు పెట్టిన పోస్టును ఎవరు? ఎంత మంది చూశారు? ఎవ్వరైనా ప్రతి స్పందించారా? అని ఆతృతగా వెతికేవారూ ఉన్నారు. ఇలా వారు పెట్టిన పోస్టుకు ఎవరూ స్పందించకపోతే తీవ్ర అసంతృప్తికి గురయ్యే వారూ ఉన్నారు. ఈ క్రమంలో అందుకు అనుగుణమైన సందేశాన్ని కోట్ చేస్తూ పోస్టు చేస్తున్నారు. మొత్తంగా వాట్సాప్ స్టేటస్‌లో వారు పోస్టు చేసే దాన్ని బట్టి వారు ఎలాంటి వారు, వారి మనస్తత్వమేమిటో ఇట్టే చెప్పేయవచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

దేవుళ్లు.. దేవతలు..

వాట్సాప్ స్టేటస్‌తో చాలా ఉపయోగాలు ఉన్నప్పటికీ 50 శాతం మంది ఏ రోజుకు ఆ రోజు సంబంధిత దేవుళ్ల ఫొటోలు, పాటల వీడియోలు పోస్టు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిని చూసిన అదే రకమైన వారు ప్రతిస్పందిస్తూ లైక్‌లు, కామెంట్‌లు పెడుతున్నారు. మరికొందరు ప్రతిస్పందిస్తూ సంజ్ఞలు తెలిపే చిత్రాలను పోస్టు చేస్తున్నారు. హిందువులు ఆయా రోజు ప్రత్యేకతను బట్టి దేవుళ్ల గురించి పోస్టు పెడుతున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు అయితే రోజుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వారి మత సంబంధ కోట్స్ పోస్టు చేస్తున్నారు.

మనోభావాలు వ్యక్తం చేస్తూ..

కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలు ఎంపిక చేసుకుని స్టేటస్‌లో పోస్టు చేస్తూ ఆనందిస్తున్నారు. ఇవి వారికి నచ్చిన వారికి మంచిగా, నచ్చని వారికి చెడుగా స్ఫురించవచ్చు. ఆ కోట్స్‌ను పోస్టు చేసిన వ్యక్తిని బట్టి ఎవరు ఎలా రిసీవ్ చేసుకుంటే అలా కనిపిస్తాయి. ఒక విధంగా పోస్టు చేసిన వ్యక్తి మనోభావాలు ఇలా స్టేటస్ రూపంలో ప్రతి స్పందిస్తాయనడంలో సందేహం లేదు. చాలా మంది వారికి జరిగిన మంచి, చెడును ఇతరులకు చెప్పేందుకు స్టేటస్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను పోస్టు చేస్తున్నారు.

వ్యక్తిగత ప్రతిభ చాటడానికి...!

చాలా మంది తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి స్టేటస్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఎందులోనైనా వారు ప్రతిభ సాధించి ఉంటే అప్పటికప్పుడు స్టేటస్‌లో పోస్టు చేస్తున్నారు. లేదా వారి కుటుంబసభ్యుల్లో ఎవరు ప్రతిభ సాధించినా పోస్టు చేస్తున్నారు. ఈ పోస్టును చూసిన వారు తప్పక అభినందనలతో ముంచెత్తుతున్నారు. దీనివల్ల మానసికానందం పొందుతున్నారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలు, వ్యాపారాభివృద్ధి, విద్య, ఉద్యోగాల్లో ప్రతిభ చాటడం, క్రీడల్లో సత్తా చాటడం వంటి అంశాలను స్టేటస్‌లో పోస్టు చేసి వాటిని చూసిన వారి నుంచి ప్రశంసలు పొందుతున్నారు.

బిజినెస్‌కు వేదికగా..

వ్యాపారాభివృద్ధికి సోషల్ మీడియా కూడా ఒక ప్రచార వేదికగా మారింది. అందులో అందరూ ఎక్కువగా చూసే వాట్సాప్ స్టేటస్‌ను చాలా మంది వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారం గురించి వివిధ రూపాల్లో బ్రోచర్లు ముద్రించి స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఆయా వస్తువుల వివరాలు, వాటిలోని ఫీచర్లు, ధర గురించి అందులోనే పోస్టు చేస్తుండటంతో చూసిన చాలా మంది వెంటనే సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వస్తువును కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది అన్ని రకాల వ్యాపారులు వారి వ్యాపార వస్తువులను వాట్సాప్ స్టేటస్‌లో పోస్టు చేస్తూ వ్యాపారాభివృద్ధి చేసుకుంటున్నారు.



ఇట్లు.. మేము బాగున్నాం..

ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో బంధువులు, స్నేహితులకు కనీసం ఫోన్లు చేసి యోగక్షేమాలు తెలుసుకునే సమయం ఉండటం లేదు. ఏదైనా కార్యక్రమంలో కలిసినప్పుడు హాయ్.. బాయ్ అన్నట్లుగా ఉంటుంది. కనీసం పిల్లలు, కుటుంబ పరిస్థితుల గుర్తించి అడిగేవారు.. చెప్పేవారు లేరు. ఈ క్రమంలో వాట్సాప్ స్టేటస్‌ను ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకుంటున్నారు. స్టేటస్ ఒక లేఖలా మారిపోయింది. ఉదాహరణకు ఏదైనా విహార, శుభకార్యాలు, తీర్థయాత్రకు వెళ్లారంటే అందుకు సంబంధించిన ఏ రోజుకు ఆ రోజు ఫొటోలు సమయంతో సహా కుటుంబసభ్యులంతా ఉండే ఫొటోలు పోస్టు చేసి ఆనందిస్తున్నారు. ఆ పోస్టులను చూసిన వారు ఫలానా వారు ఫలానా ఊరికి యాత్రకు వెళ్లినట్లు ఉన్నారని వెంటనే గ్రహిస్తారు. మరికొందరు వారికి ఏదైనా చెడు జరిగిందంటే ఉదాహరణకు రోడ్డు ప్రమాదమో లేదా ఇతర ప్రమాదాలు, ఆరోగ్యం బాగాలేకపోయినా వారి స్థితిని తెలియజేస్తే ఇతరుల సానుభూతిని పొందేందుకు పోస్టు చేస్తూ ఉంటారు. ఆ పోస్టు చూసిన వారు అయ్యో వారికి ఆరోగ్యం బాగాలేదా అని తెలుసుకుని స్వయంగా వెళ్లడమో లేదా ఫోన్ చేసి పరామర్శించడమో చేస్తున్నారు.

ఏది పడితే అది పోస్టు చేయకూడదు



నేను పెట్టే పోస్టులను నా గ్రూపులో ఉన్న 60 నుంచి 70 శాతం మంది చూస్తున్నారు. ఇటీవల వరల్డ్ డయాబెటిస్ గురించి పోస్టు పెట్టాను. నాకు ఫోన్ చేసి షుగర్ గురించి వారికున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అలాగే గంటలకు పైగా సైక్లింగ్ చేసిన తర్వాత కలిగిన అనుభవం గురించి పోస్టు చేశాను. సైక్లింగ్ వల్ల లాభాల గురించి ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చూస్తున్నారు కదా అని ఏది పడితే అది పోస్టు చేయకూడదు. అవగాహనతో చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుని పోస్టు చేయాలి.

– డాక్టర్ ఎం. శ్రీకాంత్‌రెడ్డి, డయాబెటాలజిస్టు, కర్నూలు

ప్రజల్లో అవగాహన పెంచడానికే..



ఇటీవల కాలంలో యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ లాంటి సోషల్ మీడియాల్లో కొందరు వ్యక్తులు వారికి అర్హత లేకపోయినా ఆరోగ్యం గురించి పలు రకాల పోస్టులు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇలాంటి వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు గాను ఒక డాక్టర్‌గా బాధ్యత తీసుకుని నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు 'స్టేటస్'లో పోస్టులు పెడుతున్నాను. నేను నూతన విధానాల్లో చేసిన సర్జరీలు, విదేశాల్లో ఉన్న ఆధునిక వైద్య విధానాలు, మన దేశాల్లో రావాల్సిన ఆవశ్యకత, వివిధ రకాల జబ్బుల గురించి వివరిస్తూ పోస్టులు పెడుతున్నాను.

– డాక్టర్ వసీం హసన్ రాజా, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

వ్యాపార ప్రచారానికి ఉపయోగపడుతోంది



నేను వ్యాపారవేత్తను. ఇందులో భాగంగా పలు రకాల వ్యాపారాలు చేస్తుంటాను. ఇందుకు సంబంధించి ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు ఇస్తుంటాను. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువ మంది చూస్తున్న వాట్సాప్ స్టేటస్‌లోనూ పోస్టులు పెడుతున్నాను. దీనికి మంచి స్పందన వస్తోంది. నేను చేస్తున్న స్కూళ్లు, కాలేజీలు, కోచింగ్ సెంటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల గురించి పోస్టులు పెట్టాను. ఇటీవల రియల్ ఎస్టేట్ పోస్టులు స్టేటస్‌లో చూసి కొందరు క్లయింట్‌లు మావద్దకు వచ్చి కొనుగోలు చేశారు. సోషల్ మీడియాను ఎవరు ఏ విధంగా వాడుకుంటే అలా ఉపయోగపడుతుంది.

– పి. గోవర్ధన్‌రెడ్డి, వ్యాపారి, కర్నూలు

ఎస్సార్బీసీకి గండి

- నీట మునిగిన పంటపొలాలు
- 250 ఎకరాల్లో దెబ్బతిన్న శనగ, పొగాకు, మినుము పైర్లు
- లబోదిబోమంటున్న రైతన్నలు



పొగాకు పంటను ముంచెత్తిన కాల్వనీరు

కోవెలకుంట్ల: ఎస్సార్బీసీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. బలహీనంగా ఉన్న కాల్వగట్టును ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో కోవెలకుంట్ల సమీపంలోని ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వకు శనివారం మరోసారి గండి పడింది. రెండు నెలల క్రితం కోవెలకుంట్ల- గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారికి 200 మీటర్ల దూరంలో కాల్వకు గండి పడగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలో గండి పడ్డ వంద మీటర్ల దూరంలోనే ఇప్పుడు మరో గండి పడి నీరంతా పంట పొలాల్లో చేరింది. కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాలకు చెందిన రామసుబ్బారెడ్డి, కొండన్న, నాగరాజు, మునిరెడ్డి, తిరుపాలు, గోవిందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి, సతీష్‌రెడ్డి, పెద్ద మునయ్య, తదితర రైతులు సుమారు 250 ఎకరాల్లో పప్పుశనగ, పొగాకు, మినుము పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఆయా పైర్లు చేతికందే దశలో ఉన్నాయి. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎస్సార్బీసీ అధికారులు రెండు రోజుల క్రితం కాల్వకు అధికస్థాయిలో నీరు విడుదల చేశారు. ఉధృతికి కాల్వగట్టు తెగిపోవడంతో నీరు పంట పొలాలను ముంచెత్తింది. పైర్లలో నీరు భారీగా చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేలకు పైగా వెచ్చించారు. మరో నెల రోజుల్లో పంట దిగుబడులు చేతికందాల్సిన తరుణంలో కాల్వ నీరు పైర్లను ముంచెత్తడంతో కష్టపడిన శ్రమంతా నీటిపాలైందని వాపోతున్నారు.

కారణమైన అధికారుల నిర్లక్ష్యం

ఎస్సార్బీసీ అధికారులు కాల్వలను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే కాల్వకు గండ్ల సమస్య వెంటాడుతోంది. కోవెలకుంట్ల ఎస్సార్బీసీ పరిధిలో ఏడో బ్లాక్ నుంచి 13వ బ్లాక్ కాల్వల ద్వారా కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, అవుకు మండలాల్లో దాదాపు 94 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఏటా జులై నెలాఖరు నుంచి మరుసటి ఏడాది ఫిబ్రవరి వరకు శ్రీశైలం జలాశయం నుంచి నీరు విడుదల చేస్తున్నారు. మార్చి నెల నుంచి జులై నెల వరకు కాల్వల్లో నీరు ఉండదు. నీరు ప్రవహిస్తున్న కాల్వలను ఎస్సార్బీసీ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నీటి ప్రవాహం లేని సమయంలో అంటే వేసవికాలంలో కాల్వల్లో పూడిక తీత, కాల్వగట్ల వెంట కంపచెట్ల తొలగింపు, కాల్వ మరమ్మతులు, కాల్వగట్ల పటిష్టతపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే కాల్వలకు గండ్లు పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయండి

నంద్యాల: జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంతజూటూరు నుంచి ఓంకారం, వైఎస్సార్ స్మృతివనం, నంద్యాల జిల్లాను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవుకు బోటింగ్, రెస్టారెంట్ నిర్వహణకు టెండర్లు పిలిచి ఖరారు చేయాలన్నారు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు పాత బకాయిల వసూళ్లకు చివరిసారిగా నోటీసులు ఇచ్చి చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లు, చెరువుల బోట్లలో ప్రయాణానికి సంబంధించి తొమ్మిది రకాల అనుమతులు తీసుకోవాలన్నారు. సిద్ధేశ్వరం నుంచి సోమశిల సింగోటం జాతరకు భక్తులు బోట్లలో వెళ్తున్నారని, అనుమతులు లేని వాటిలో ప్రయాణం చేయకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డీవీఎం చంద్రమౌళి, డీఈ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బారాయుడు, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగమునేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్చ్... 'నీరు'గార్చారు!

- 77 చెరువులను నీటికి నింపకపోవడం బాధాకరం
- జెడ్పీ ఛైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అసహనం
- నీటి పారుదలపై సుదీర్ఘ చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): 'ఈ ఏడాది 2 వేల టీఎంసీల వరద జలాలు వృథాగా సముద్రం పాలయ్యాయి. మీరు సకాలంలో స్పందించి ఉంటే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జలాశయాలన్నింటినీ నింపుకునే అవకాశం ఉండేది. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కర్నూలు జిల్లాలోని 4.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న గాజులదిన్నె, 1.235 టీఎంసీల సామర్థ్యం ఉన్న సుంకేసుల ప్రాజెక్టులను కూడా నింపుకోలేక పోయాం. ఇలాంటి పరిస్థితి మునుపెన్నడు చూడలేదు. ఎప్పటికప్పుడు వరద నీటిని సద్వినియోగం చేసుకొని ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాద'ని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఇరిగేషన్ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు.

ఎన్ని చెరువులు నింపారు ?

సమీక్షలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 77 చెరువుల్లో ఇప్పటి వరకు ఎన్ని చెరువులను నింపారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు 58 చెరువులను నింపామని, మరో రెండు నెలల్లో మిగిలిన చెరువులను కూడా నింపుతామని సమాధానమిచ్చారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి రోజుకు ఎన్ని నీళ్లు డ్రా చేస్తున్నారని చైర్మన్ ప్రశ్నించగా రోజుకు 2 వేల క్యూసెక్కులు డ్రా చేస్తున్నామని ఈఈ సమాధానమిచ్చారు. మరి ఈ లెక్కన నాలుగు నెలలకు 24 టీఎంసీలు డ్రా చేసి ఉండాలి కదా అని నిలదీశారు. అలాగే 77 చెరువుల నీటి సామర్థ్యం 1.24 టీఎంసీలు మాత్రమేనని, మిగిలిన నీరు ఏమైందని చైర్మన్ ప్రశ్నించారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో కేవలం 2 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలుస్తోందని, ఈ నీటిని తాగు, సాగు అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉందని, వేసవిలో ఎలా చేస్తారని ప్రశ్నించారు.

సకాలంలో శనగ విత్తనం సరఫరా చేయకపోవడం వల్లే ...

సకాలంలో రైతులకు శనగ విత్తనం సరఫరా చేయకపోవడం వల్లే జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిందని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. గతంలో శనగకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇచ్చిందని, ప్రస్తుతం 25 శాతం సబ్సిడీ ఇవ్వడంతో రైతులు కొనుగోలుకు ఆసక్తి చూపలేదన్నారు. రైతులకు వ్యవసాయ పనులు అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను కొంత మేర వాయిదా వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్యాపిలి జెడ్పీటీసీ శ్రీరాంరెడ్డి, చైర్మన్ పాపిరెడ్డి కోరారు.

- నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తనకు తెలియజేయరా ? అని నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ ఉమాపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు బి. నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, డీపీఓ జి.భాస్కర్, వ్యవసాయ శాఖ జెడీ వరలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. తులసీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్, డీఎస్ఓ రాజారఘువీర్, పీఆర్ ఈఈలు ఎస్ మద్దన్న, రఘురామిరెడ్డి, నంద్యాల సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి చింతామణి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.828.159 కోట్లకు ఆమోదం

జిల్లా పరిషత్, అనుబంధ శాఖలకు సంబంధించిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.828.159 కోట్లకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమోదించారు. శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో జెడ్పీ బడ్జెట్‌ను డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి ప్రవేశ పెట్టారు. 2023-24లో ఆదాయం రూ.357.750 కోట్లు కాగా, వ్యయం రూ.348.693గా, 2024-25 అంచనా బడ్జెట్ రూ.1086.456 కోట్లు, వ్యయం రూ. 1068.582 కోట్లుగా చూపారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో భాగంగా ఆదాయం రూ.766.142 కోట్లు కాగా, వ్యయం రూ.757.766 కోట్లుగా చూపారు. 2025-26కు సంబంధించిన చూపిన అంచనా బడ్జెట్‌లో వ్యయం రూ.821.966 కోట్లుగా వివరించారు. ఇందులో జిల్లా పరిషత్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పద్దులు, స్టాంప్ డ్యూటీ, తలసరి గ్రాంట్, గనుల శిస్తు, జెడ్పీ స్థిరాస్తులకు సంబంధించిన రాబడులు పొందుపరిచారు.

గిరిజన విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమా?

- ఇలాగైతే 'పది' విద్యార్థులు ఎలా పాస్ అవుతారు
- ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్తే పట్టించుకోరా?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసానికి సమస్యలు విన్నవిస్తున్న పాణ్యం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు

పాణ్యం: గిరిజన విద్యార్థుల భవిష్యత్‌తో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం పాణ్యం గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. 'సార్ మాకు అమ్మఒడి రాలేదు.. ట్యాబ్‌లు ఇవ్వలేదు.. పరీక్షలు దగ్గర పడుతున్నా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నాం.. ఎలాగైనా ఉపాధ్యాయులను పంపండి' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్లి 40 రోజులు గడిచినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఎఫ్‌సీ ప్యానెళ్లు ఇప్పుడు విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఉపాధ్యాయులు లేకపోయినా అందులో పాఠాలు వింటూ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో పాఠశాలు రూపురేఖలు మారాయని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌ను విమర్శించే వారు ఒక సారి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు కోసం ఇద్దరు వలంటీర్లను నియమించుకోవాలని, వారికి గ్రీన్‌కో సంస్థ సహాయంతో వేతనాలు ఇచ్చేలా మాట్లాడుతానని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణానాయక్‌కు కాటసాని సూచించారు. ఆయన వెంట పార్టీ నేతలు చంద మామ బాబు, ఎల్లగౌడ్, లక్ష్మానాయక్, పెద్దస్వామి, రామచంద్రుడు, సత్యాలు, రమణతో పాటు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

- పలు అనుమానాలు

ఓర్వకల్లు: మండలంలోని కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఓ వ్యక్తి శనివారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డా డు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు గీతా నగర్‌కు చెందిన ఉప్పర జమ్మన్న కుమారుడు శివన్న(57)కు మానసిక స్థితి సరిగా లేక ఈనెల 27న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో కొమ్ముచెరువు ఆంజనేయస్వామిని దర్శించుకొని, గుడివద్ద చెట్టుకు తాడుతో ఉరేసుకున్న స్థితిలో మృతిచెంది కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బైక్ పైకెక్కి చెట్టుకు ఉరివేసుకున్నట్లు ఉండటంతో ఎవరైనా హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

న్యాయం చేయండి సారూ!

- తమ భూమి వేరే రైతు పేరుతో బదిలీ అయ్యిందని తల్లీకూతుళ్ల ఫిర్యాదు



డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న బాధిత మహిళలు

హొళగుంద: తమ భూమి వేరే రైతు పేరు మీదకు బదిలీ అయ్యిందని, విచారించి న్యాయం చేయాలని స్థానిక కోటవీధికి చెందిన బోయ మారెమ్మ, కూతుళ్లు ఉమాదేవి, అనిత, శాంతి అధికారులను కోరారు. శనివారం వారు డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 365సీ1సీ సర్వే నంబరులో 1.52 ఎకరాల భూమి వారసత్వంగా భర్త నుంచి తనకు సంక్రమించిందని మారెమ్మ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ అడంగల్ ఉన్నాయని, అయితే నాలుగు రోజుల క్రితం చిన్నహ్యాట గ్రామానికి చెందిన రైతు నాగరాజు పేరుతో బదిలీ అయ్యిందని వాపోయారు. మగదిక్కులేని తాము భూమి మీదే బతుకుతున్నామని, విచారించి తన భూమి తన పేరుమీదకు బదిలీ చేసి న్యాయం చేయాలని ఆమె కోరింది. ఈ విషయమై తహసీల్దారు సతీష్‌ను ఆరా తీయగా విచారించి బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పరుగు పోటీలు

- అడుగడుగునా నిఘా నేత్రాలు
- పోలీసు అభ్యర్థులకు వివిధ పరీక్షల కోసం సర్వం సిద్ధం
- రేపటి నుంచి ఏపీఎస్పీ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు



ఏపీఎస్పీ పటాలంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

కర్నూలు: పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీ నుంచి కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు, పరుగు పోటీల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో హై ఫ్రీక్వెన్సీ ఉపయోగిస్తున్నారు. జాతీయస్థాయిలో క్రీడాపోటీలు, రైల్వే, కేంద్ర భద్రతా బలగాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసు ఉద్యోగాల ఎంపికకు పనిచేసిన సంస్థ ఇక్కడ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. దీంతో పాటు పోలీసు శాఖకు చెందిన ఐటీ కోర్ విభాగం సిబ్బంది సేవలు అందిస్తున్నారు. పోటీలు, పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మైదానంలో ఎత్తు, ఛాతీ కొలత, 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు జరిగే ప్రతిచోటా నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి వాటి సంఖ్యను మరింత పెంచనున్నారు.

సెన్సార్లు, చిప్స్ వినియోగం

అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు మొదలైనప్పటి నుంచి వారి ఛాతీ నెంబర్‌పై క్యూర్ కోడ్‌తో కూడిన బ్యాడ్జితో పాటు పరుగు పోటీల సమయంలో కాళ్లకు సెన్సార్ చిప్స్ అమర్చిన ట్యాగులు ఏర్పాటు చేయనున్నారు. వాటిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సర్వర్‌కు అనుసంధానం చేస్తున్నారు. పరుగు మొదలై ముగిసే సమయం వరకు ప్రతి సెకను ఆ చిప్స్ ద్వారా కంప్యూటర్‌లో నమోదవుతుంది. ఎత్తు, కొలత యంత్రంలో తల పైభాగం, కాళ్ల అడుగు భాగంలోనూ సెన్సార్లు ఉంటాయి. ఇలా ప్రతి విభాగంలో చిన్నపాటి పొరపాట్లకు తావు లేకుండా ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించింది మొదలు దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని మైదానం నుంచి తిరిగి వెళ్లే వరకు వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పది వేల మందికి పైగా అభ్యర్థులు

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 10,143 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో మహిళా అభ్యర్థులు కూడా ఉన్నారు. ఈనెల 30 నుంచి రోజూ 600 మంది అభ్యర్థుల చొప్పున పోటీల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే పరీక్షల నిర్వహణకు కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల జిల్లా నుంచి పోలీసు అధికారులు, పరిపాలనా విభాగం సిబ్బందిని నియమించారు.

అభ్యర్థులకు సూచనలు ఇవీ..

- దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.
- ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించనియెడల అభ్యర్థిత్వాన్ని అక్కడే తిరస్కరిస్తారు. వారికి సమయం కూడా కేటాయించరు.
- ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ మార్కు లిస్టులతో పాటు డిగ్రీ మార్కు లిస్టు, ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు చూపించాలి.
- ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, కమ్యూనిటీ సర్టిఫికెట్ (6 నెలల లోపు) ఉండాలి, బీసీ అభ్యర్థులు విధిగా క్రిమి లేయర్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలి (నోటిఫికేషన్ విడుదల తేదీ తర్వాత మాత్రమే ఉండాలి).
- 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నవారు ఒరిజినల్స్ తీసుకురావాలి.
- ఏజెన్సీ ప్రాంతానికి చెందినవారు ట్రైబ్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. తీవ్రవాదులు, సంఘ విద్రోహుల దాడిలో చనిపోయిన పోలీసు కుటుంబాల పిల్లలు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలనలో చూపాలి.
- చిల్డ్రన్ ఆఫ్ పోలీస్ పర్సనల్ సర్టిఫికెట్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ర్యాంక్ లోపు అధికారుల పిల్లలకు మాత్రమే).
- ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్ (సర్వీస్ బుక్‌తో పాటు).
- మెరిటోరియస్ స్పోర్ట్స్ సర్టిఫికెట్ కలిగి ఉన్న వారు చూపించాలి.
- కాల్ లెటర్‌లో తెలిపిన స్కోర్ కార్డు (ఒరిజినల్ రిజల్ట్ చూపించాలి).
- స్టేజ్1, స్టేజ్2 అప్లికేషన్లను తప్పనిసరిగా తీసుకురావాలి.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



పోలీసు ఉద్యోగాల నియామక విషయంలో దళారుల మాటలు నమ్మి మోసపోకండి. ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా, రిక్రూట్‌మెంట్లు అయినా పారదర్శకంగానే జరుగుతాయని గుర్తించాలి. దళారులు/మోసగాళ్లు ఎవరైనా అభ్యర్థులను సంప్రదిస్తే డయల్ 100 లేదా 112 గాని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అలాంటి వారి సమాచారం గోప్యంగా ఉంచుతాం. కర్నూలు జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 7777877722 లేదా 9121101100కు తెలియజేస్తే అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– బిందు మాధవ్, జిల్లా ఎస్పీ

మహాత్మా.. మన్నించు !



గాంధీ విగ్రహం చుట్టూ టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన దృశ్యం

డోన్: పట్టణ ప్రధాన కూడలిలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ రాజకీయ రంగు పులమడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల అనుమతు లు లేకుండానే గాంధీ విగ్రహాన్ని సైతం వదలకుండా చుట్టూ ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లను కట్టడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. వ్యక్తిగత స్వలాభం కోసం టీడీపీ నాయకులతోపాటు కూటమి నాయకులు తమ కటౌట్లు, ఫ్లెక్సీల తాళ్లతో బంధించడం చూసి మహాత్మా.. మన్నించు అంటూ ప్రజలు వేడుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్ట్‌కు గాయాలు

ఆస్పరి: మండలంలోని పుప్పాలదొడ్డి – కైరుప్పల గ్రామాల మధ్య శనివారం పత్తికొండ ఆర్టీసీ బస్సు స్టీరింగ్ కట్ కావడంతో ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొంది. ప్రమాదంలో స్కూటరిస్ట్ గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన పెద్దయ్య గాయాలపాలయ్యాడు. కాగా డ్రైవర్ చాకచక్యంతో బస్సును ఆపేయడంతో అందులో ఉన్న 40 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. స్కూటర్‌పై ఉన్న ఐదేళ్ల బాలుడు స్వల్ప గాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రేషన్ బియ్యం మాయమనేది కట్టుకథ

- అవాస్తవాలను మాజీ మంత్రి బుగ్గనకు ఆపాదించడం వెనుక కుట్ర
- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన వారి బఫర్ గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయమయ్యాయని కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తుండటం వారి అవివేకానికి నిదర్శనమని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఉర్దూ అకాడమీ స్టేట్ మాజీ డైరెక్టర్ ముర్తుజావలి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ ఖాజాహుసేన్, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ఇబ్రహీం, దస్తగిరి విమర్శించారు. శనివారం వారు మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. బేతంచెర్ల బఫర్ గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయం అని సంబంధిత అధికారులు, గోడౌన్ నిర్వాహకుల వివరణ లేకుండా ఏకపక్షంగా ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై పత్రికల్లో రాయడం ఏమి జర్నలిజమని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు చెప్పిందే నిజమని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఏడుగురు సభ్యులు కలిసి నిర్మించుకున్న ఈ బఫర్ గోడౌన్ నిర్వహణను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బలవంతంగా లాక్కున్నారన్నారు. ఇందులో రేషన్ బియ్యం తేడా వస్తే ఈనెల 31వ తేదీలోపు అధికారులకు నిర్వాహకుడు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికి, మాజీ మంత్రికి ఏమి సంబంధమని వారు నిలదీశారు. సెలవు ఉన్న క్రిస్మస్ రోజు టీడీపీ నాయకుని మాటలు నమ్మి అధికారులు గోడౌన్‌ను తనిఖీ చేశారన్నారు. సరుకులో తేడా వస్తే నిర్వాహకులకులతో సంజాయిషీ తీసుకోవాలన్నారు. కానీ అలాంటిదేమీ లేకున్నా బుగ్గనపై నిందలు వేయడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నంద్యాలలో బఫర్ గోడౌన్ ఉండగా, బేతంచెర్ల గోడౌన్‌లోనే బియ్యాన్ని ఎందుకు నిల్వ ఉంచారని కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల ప్రాంతాలకు రవాణా చేసేందుకు బేతంచెర్ల అనువుగా ఉండటం, ఇక్కడ రైల్వే డంపింగ్ యార్డు సౌకర్యం కూడా ఉండటంతో ప్రభుత్వం బఫర్ గోడౌన్‌ను ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వీటి మూలంగా రవాణా, హమాలీ చార్జీల ద్వారా ఏటా ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు ఆదా అవుతోందన్నారు. వాస్తవాలు తెలుసుకొని కథనాలు ప్రచురించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ రమేష్

బనగానపల్లె రూరల్: మండలంలోని జ్వాలాపురం గ్రామ సమీపంలో దద్దణాల ప్రాజెక్టు వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఎదురెదురుగా లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ రమేష్(28) మృతి చెందాడు. ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ రమేష్ కర్ణాటక నుంచి బనగానపల్లె వైపు సిమెంట్ లోడ్‌తో బయలుదేరాడు. దద్దణాల ప్రాజెక్టు సమీపంలోని మలుపు వద్ద బనగానపల్లె నుంచి పసుపల వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్ రమేష్ తలకు తీవ్ర గాయాలు కాగా మరో లారీ డ్రైవర్ నారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందిన్నట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి గొలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాతపద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలి



మోకాళ్లపై రిలే దీక్షలు చేస్తున్న గనులు, ఫ్యాక్టరీ యజమానులు

బేతంచెర్ల:మైన్స్‌తో సమానంగా కాకుండా ప్రభుత్వం నాపరాయి గనులకు పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని ఫ్యాక్టరీ, ట్రాక్టర్, లారీ, గను ల యజమానులు గుండా గోపాలు, తిరుమలేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్‌రావు, ఉపేంద్ర డిమాండ్ చేశారు. శనివారం బనగానపల్లె రైల్వే గేటు సమీపంలో ఫ్యాక్టరీ, ట్రాక్టర్, లారీ, గనుల యజమానులు మోకాళ్లపై నిలుచొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 ఎకరాల్లో ఉన్న ఐరన్ ఓర్ మైన్స్‌తో సమానంగా కాకుండా ఎకర, ఎకరన్నరలో ఉండే నాపరాయి గనులపై పరిశ్రమపై విధించిన పన్నును ఎత్తివేసి పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న తరహా పరిశ్రమ అయిన నాపరాయికి ప్రభుత్వం రాయితీలు కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో గనుల, ఫ్యాక్టరీ యజమానులు రాంబాబు, నాగమయ్య, నవీన్, బాబు, ప్రసాద్, చోటే, వెంకటేశ్వర్లు, సతీశ్, సుబ్బారావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- రూ.1.76 లక్షల నగదు, 80 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సోమన్న



బంగారు ఆభరణాలు, నిందితులను చూపుతున్న డీఎస్పీ సోమన్న, సీఐ శ్రీరామ్, పోలీసులు

ఆదోని అర్బన్: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆదోని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.76 లక్షల నగదు, రూ.6.24 లక్షల విలువ చేసే 80 గ్రాముల బంగారు ఆభరణలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శ్రీరామ్‌తో కలిసి డీఎస్పీ సోమన్న విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆలూరు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన గోవిందరాజులు, నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని చిరుమాన్‌పేటకు చెందిన ఎరుకలి బండి చిన్న ఆదోని, కర్నూలు తదితర ప్రాంతాల్లో చోరీలు చేస్తూ తప్పించుకు తిరిగేవాళ్లు. కేసు నమోదు చేసుకున్న ఆదోని వన్ టౌన్ పోలీసులు నిందితులపై నిఘా ఉంచారు. స్థానిక తిమ్మారెడ్డి బస్టాండు వద్ద తచ్చాడుతూ ఉండగా అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాలు అంగీకరించారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.1.26 లక్షల నగదు, కర్నూలు 4వ పోలీస్‌స్టేషన్ పరిధిలో 40 గ్రాముల బంగారు ఆభరణలు, ఆదోని టూటౌన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.50 వేలు నగదు, 40 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో వారిని అరెస్ట్ చేసి నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఇదే కేసులోని మరో ఇద్దరు నిందుతులు పరారీలో ఉన్నారని, త్వరగా పట్టుకుంటామని ఆయన తెలిపారు. కేసును ఛేదించిన సీఐ శ్రీరామ్, హెడ్ కానిస్టేబుల్ సత్తార్‌వలి, కానిస్టేబుళ్లు లక్ష్మన్న, అశోక్‌కుమార్, మునిస్వామి, రామచంద్రలను డీఎస్పీ అభినందించారు.

ఆర్‌బీకే శిలాఫలకం ధ్వంసం



దుండగుల చేతిలో ధ్వంసమైన శిలాఫలకం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని మిట్నాల గ్రామ సమీపంలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రం (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం) శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని అప్పటి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల క్రితం దుండగులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారన్న సమాచారంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పల చిన్న తిరుపతిరెడ్డి, గోపాల్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా శిలాఫలకం ధ్వంసం విషయం ఎవరికీ చెప్పవద్దని తిరిగి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు నాయకులకు హామీ ఇవ్వడం గమనార్హం. కాగా ఇలాంటి ఘటనలు జరగకుండా దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

పెయింటర్ దుర్మరణం



గోరంట్ల(ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి – పెద్దనేలటూర్ గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన గోరంట్ల(25) గోనెగండ్లలో పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం గోనెగండ్లకు వచ్చాడు. సాయంత్రం బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. హెచ్. కైరవాడి నుంచి పెద్దనేలటూర్‌కు వెళ్లే దారిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బైక్ టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో కోడుమూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య శృతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

హోరాహోరీగా సాగుతున్న జోనల్ పోటీలు



తలపడుతున్న ఖోఖో క్రీడాకారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఎంజేపీ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో జోనల్ స్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. శనివారం రెండోరోజు కబడ్డీ, ఖోఖో, హ్యాండ్ బాల్, వాలీబాల్, చెస్, టెన్నికాయిట్, షటిల్ విభాగాలతోపాటు 100, 200, 400, 800, 1,500 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, డిస్కత్రో, షాట్‌పుట్, జావలీన్ త్రో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.